సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



రామప్ప వైభవాన్ని చాటిచెప్పాలి

మిస్ వరల్డ్ టీమ్ అబ్బురపడేలా రామప్ప కళావైభవం చాటిచెప్పాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. - 8లో▸



'సన్న బియ్యం' దేశానికే ఆదర్శం

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం దేశానికే ఆదర్శమని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $37^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో వడ గాలులు వీస్తాయి. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆలయ నిర్మాణానికి రూ.3లక్షల విరాళం



చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలోని శివాలయం శిథిలావస్థలో ఉండడంతో ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు, దాతలు సహకారం అందిస్తున్నారు. ఈమేరకు మండలంలోని ఏలేటి రామయ్యపల్లి గ్రామానికి చెందిన కీ.శే.ఏలేటి రాంరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు ఏలేటి రాజు–స్వప్న, ఏలేటి శ్రీనివాస్– జమున దంపతులు రూ.3లక్షల 116 అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలియజేసినట్లు కమిటీ అధ్యక్షుడు కసిరెడ్డి రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మోత్కురి నరేష్, సత్యనారాయణరావు, మందల రాఘవారెడ్డి, సమ్మిరెడ్డి, బొమ్మ శంకర్, చెక్క నర్సయ్య, కొక్కుల సారంగం, శరత్, తీగల నాగరాజు, రాజయ్య, రాజు, రవి, ఆలయ ప్రధాన అర్చకులు రఘునందన్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



భూపాలపల్లి అర్బన్: వేసవి కాలం నేపథ్యంలో ఏరియాలోని కేటీకే 5వ గని ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, ఓఆర్ఎస్ నీటి పంపిణీ కార్యక్రమాన్ని డీజీఎం జాకిర్‌హుస్సేన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా డీ హైడ్రేషన్, ఉప్పు సమతుల్యత సమస్యలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ చంద్రశేఖర్, అధికారులు అభిషేక్, సందీప్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు తిరుపతి, రాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

24న ఉచిత విద్య ప్రవేశ పరీక్ష

భూపాలపల్లి అర్బన్: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన ఉచిత విద్య ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త కుమారస్వామి ప్రకటనలో తెలిపారు. పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ వారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించే లక్ష్యంతో ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 4, 5, 6 తరగతి విద్యార్థులు అర్హత పరీక్ష రాసి 5, 6, 7 తరగతుల్లో ప్రవేశం పొందనున్నట్లు తెలిపారు. 80 మార్కులతో ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలుగు, గణితం, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం నుంచి ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ఈ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు వారి ప్రవేశం పొందిన తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతోపాటు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తారని తెలిపారు. గ్రామీణ నిరుపేదలు, తల్లిదండ్రులు లేని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. http://forms. gle/ uhxD4 Dj8 oyxMUdPM7 వెబ్‌సైట్‌లో గూగుల్ ఫామ్ నింపి పేరును నమోదు చేసుకోవాలని, సందేహాలుంటే 99491 74837, 95534 05934, 99489 36911 నంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.


రామప్పను సందర్శించిన సీపీ సన్‌ప్రీత్‌సింగ్



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ శనివారం కుటుంబ సమేతంగా సందర్శించారు. రామలింగేశ్వర స్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్‌లు తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సన్మానించారు. టూరిజం గైడ్ వెంకటేశ్ వారికి ఆలయ విశిష్టత వివరించగా రామప్ప శిల్పకళా సంపద బాగుందని కొనియాడారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించి బోటింగ్ చేశారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై సతీష్, సిబ్బంది ఉన్నారు.

భవిత.. భరోసా

- దివ్యాంగ విద్యార్థులకు ఎనిమిది నెలల భత్యం విడుదల
- 329 మందికి రూ.8.92 లక్షల నిధులు
- నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



కాటారం భవిత కేంద్రం

కాటారం: దివ్యాంగ విద్యార్థులకు విద్యాపరంగా, ఇతర అంశాలపై భవితా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కల్పించడంతోపాటు కేంద్రాల వద్దకు రాలేని వారికి ఇంటి వద్దనే తర్ఫీదు ఇచ్చి వారిలో క్రమంగా మార్పులు తీసుకురావడం కోసం గతంలో ప్రభుత్వాలు విలీన విద్యకు శ్రీకారం చుట్టాయి. మానసిక, శారీరక వైకల్యం కల్గిన బాల బాలికలకు వివిధ పద్ధతుల్లో విద్య అందించడానికి ప్రభుత్వం గతంలో విలీన విద్యా వనరుల కేంద్రాలు(ఐఈఆర్సీ) ఏర్పాటు చేసింది. వీటినే భవిత కేంద్రాలుగా పిలుస్తుంటారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్థికంగా వెనుకబడి, దివ్యాంగులైన తమ చిన్నారులను శిక్షణకు తీసుకురాలేని కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలనెలా రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ అలవెన్స్ రూపంలో భత్యం అందజేస్తూ ప్రోత్సాహిస్తున్నాయి. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర శిక్షా తెలంగాణ, పీఎంశ్రీ ఆధ్వర్యంలో సమకూరుస్తున్నాయి. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎనిమిది నెలల భత్యం రూ.8.92 లక్షలు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది.

జిల్లాలో 12 భవిత కేంద్రాలు..

జిల్లాలో మొత్తం 12 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటిలో కాటారం, భూపాలపల్లి, చిట్యాల కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా మిగిలిన 9 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోని ఒక గదిలో భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఐఈఆర్పీ (ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లు సమ్మేళిత విద్యావిధానంతో ఈ చిన్నారులకు శిక్షణ ఇచ్చి సాధారణ పిల్లల్లా తీర్చిదిద్దుతుంటారు. భవిత కేంద్రాలకు రాలేని మానసిక వైకల్యంగల వారికి ఇంటి వద్దకే వెళ్లి నైపుణ్యాలు నేర్పిస్తుంటారు.

జిల్లాలో 329 మంది దివ్యాంగులైన బాల బాలికలు భవితా కేంద్రాల్లో శిక్షణ పొందుతుండగా 19 మంది ఐఈఆర్పీలు విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో సుమారు 65 మంది ఇంటి వద్ద నేర్చుకునే విద్యార్థులకు ప్రతి శనివారం ఒక్కో ఐఈఆర్పీలు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి బోధిస్తుంటారు.

వివిధ కేటగిరీల కింద..

- భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ పిల్లలకు నెలకు రూ.500 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పది నెలల రవాణా భత్యం అందిస్తున్నాయి. 1 నుంచి 12 తరగతి వరకు అభ్యసించే వారికి ఏటా రూ.5వేల చొప్పున చెల్లిస్తాయి.
- అంధత్వం, అంగవైకల్యం కలిగి పాఠశాలలకు వచ్చి చదివే వారికి నెలకు రూ.550 చొప్పున పది నెలలకు రూ.5,500 అందజేస్తారు. ఈ విద్యార్థులను కుటుంబ సభ్యులు ఎవరైనా తీసుకొని వస్తుండటంతో ఎస్కార్ట్ భత్యంగా కాస్త ఎక్కువ అందిస్తారు.
- పాఠశాలలు, భవిత కేంద్రాలు, ఇంటి వద్ద విద్య పొందే బాలికలకు స్టైఫండ్ కింద నెలకు రూ.200 చొప్పున పది నెలలకు రూ.2వేలు అదనంగా చెల్లిస్తారు.
- అంధులు, అల్పదృష్టి కల్గిన పిల్లలకు రీడింగ్ అలవెన్స్ పేరుతో నెలకు రూ.60 చొప్పున పది నెలలకు రూ.600 అదనంగా చెల్లిస్తుంటారు.

విద్యార్థుల ఖాతాల్లో నేరుగా..

పాఠశాలలు, భవిత కేంద్రాలు, ఇంటి వద్ద శిక్షణ పొందుతున్న మానసిక, శారీరక వైకల్యం కల్గిన పిల్లలకు ప్రభుత్వం ప్రతి ఏడాదీ రవాణా, ఎస్కార్ట్, స్టైఫండ్, రీడింగ్ అలవెన్స్‌లను అందిస్తుంది. ప్రస్తుతం జిల్లాకు సంబంధించిన లబ్ధిదారులైన విద్యార్థుల ఖాతాల్లో ప్రభుత్వమే నేరుగా డబ్బులు జమ చేస్తుంది. ఇప్పటికే జిల్లాలో అందరి ఖాతాల్లో జమ అయ్యాయి.

\- రమేశ్, విలీన విద్య జిల్లా కోఆర్డినేటర్

జగ్జీవన్‌రామ్ ఆశయాలు కొనసాగించాలి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తదితరులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని కొనసాగించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే సత్యనారాయణరావు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిట్ట చివరి పేద కుటుంబం వరకు సంక్షేమ పథకాలు చేరేవిధంగా అధికారులు పని చేసినప్పుడే మహనీయుల ఆశయాలను సాధించిన వారమవుతామని తెలిపారు. విద్యనభ్యసించడం వల్ల ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు వస్తుందనడానికి జగ్జీవన్ రామ్ జీవితం నిదర్శనమని అన్నారు. అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజాసేవతో మన్ననలు పొందారని కొనియాడారు. నేటితరం యువతకు ఆయనను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్ రామ్ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిదన్నారు. ఆయన సేవలు ప్రతి ఒక్క భారతీయుడికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, డీఆర్డీఓ నరేష్, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, ఇన్‌చార్జ్ డీఈఓ రాజేందర్, డీఎస్పీ సంపత్ రావు, వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో..

భూపాలపల్లి రూరల్: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడా రు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ ఎంతో కృషి చేశారని తెలిపారు.

నాటు సారా నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్

- 2,882 కేసులు నమోదు

భూపాలపల్లి రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భూపాలపల్లి జిల్లా పరిధిలో నాటు సారా నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు వరంగల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలో 2024 మార్చి నుంచి 2025 మార్చి 31 వరకు నిర్వహించిన దాడుల్లో 2,882 మందిపై కేసులు నమోదు చేసి, 2,160మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా 2,2157.75 లీటర్ల నాటు సారాతోపాటు 4,259 కేజీల బెల్లం, 413 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 5,43,085 లీటర్ల చక్కర పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటు సారా తయారీకి మూల పదార్థాలను స్వాధీనం చేసుకొని సప్లయ్ చేసే 1,400మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంగించిన వారి నుంచి రూ.10,15000 వసూలు చేశామని తెలిపారు.

సీతారామ ఉత్సవమూర్తుల ఎదుర్కోలు



రామాలయంలో పాలపారుక తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు



రామాలయం నుంచి ఉత్సవమూర్తులతో ఎదుర్కోలు సేవ నిర్వహిస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధ దేవాలయమైన రామాలయంలో శ్రీరామ నవమి పురస్కరించుకొని సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తుల ఎదుర్కోలు నిర్వహించారు. శనివారం రాత్రి దేవస్థాన అధికారులు, అర్చకులు ఉత్సమూర్తుల పల్లకిని ఊరేగించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు ఆరుట్ల రామాచారి, జూనియర్ అసిస్టెంట్లు రవి, శ్రీనివాస్, రాజయ్య భక్తులు పాల్గొన్నారు. ఆదివారం(నేడు) ఉదయం 10.31 గంటలకు కాళేశ్వరంలోని రామాలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణం విశేష పూజా కార్యక్రమాలతో నిర్వహించనున్నారు. ఈ కల్యాణానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు రానున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రాఘవరెడ్డిపేట పాదయాత్రలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు


టేకుమట్ల: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని రాఘవరెడ్డిపేటలో జైబాపు, జై భీం, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగ చిత్రపటాలకు పూలమాలలు వేసి, మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను ప్రజలందరికీ తెలిసేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాలను ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. సామాజికవర్గం కోసం కాదని, దేశ ప్రజలందరి కోసం రాజ్యాంగం రూపొందించినట్లు తెలిపారు. కానీ, నేడు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే కుట్ర పన్నుతుందన్నారు. రాజ్యాంగాన్ని విమర్శించే బీజేపీ నాయకులను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని కుందనపల్లిలో బాబు జగ్జీవన్‌రావు జయంతి వేడుకల్లో పాల్గొని, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. మండలంలోని ఆరెపల్లి, కుందనపల్లి, గుమ్మడవెల్లి, దుబ్యాల, ఎంపేడు, వెంకట్రావుపల్లిలోని అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ కామిడి శ్రీనివాస్‌రెడ్డి, నాయకుల శ్రీనివాస్, వీరన్న, కిరణ్, వీరేశం, రవీందర్, కుమారస్వామి, ప్రభాకర్, సంపత్, స్వామిరావు, మహిపాల్‌రెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాల్లో 'జ్ఞానతీర్థం'శోభ

- రూ.కోటితో సరస్వతీమాత విగ్రహం, సుందరీకరణ
- రూ.20లక్షలతో ఆహ్వానం పలికే ఫైబర్ విగ్రహం నిర్మాణం
- 12 రోజులపాటు కాశీ పండితులతో హారతి



పుష్కరఘాట్‌కు రెయిలింగ్‌తో మకరం నిర్మాణం నమూనా



పుష్కర ఘాట్ వద్ద జ్ఞానతీర్థం ఫైబర్‌తో చేసే ఆహ్వాన విగ్రహం నమూనా

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు జరుగనున్నాయి. పుష్కరాల అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.25 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ పలుమార్లు సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలు, మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టిసారించడంతో పనుల్లో వేగం పెరిగింది. కాగా, రూ.21 కోట్ల వ్యయంతో దేవాదాయ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, ఎన్పీడీసీఎల్‌లు పనులు ప్రారంభించాయి. అధునాతనంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో 'జ్ఞానతీర్థం' నమూనా ఎఫ్ఆర్పీ ఫైబర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఫైబర్ విగ్రహం తాళపత్ర గ్రంథాలతో రెండు చేతుల్లో దీపం వెలిగి ప్రకాశించేలా నిర్మించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

విగ్రహం ఉద్దేశం..

పూర్వం కాకి నదిలో స్నానం చేసి హంసలాగా మారి జ్ఞానం పొందింది. అలా ఇక్కడి నదిలో స్నానం చేసిన భక్తులు జ్ఞానాన్ని పొందుతారని సారాంశంగా, భక్తులను ఆహ్వానించేలా ఉండే విధంగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయవర్గాల ద్వారా తెలిసింది.

పుష్కర ఘాట్‌కు రెయిలింగ్

సుమారు 86 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్న జ్ఞానతీర్థం (వీఐపీ) ఘాట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఘాట్ తీరంలో రూ.కోటితో సరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహం చుట్టూర వేదమూర్తుల విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే తమిళనాడులోని మహాబలిపురంలో రూపుదిద్దుకుంటున్న విగ్రహం ఏప్రిల్ రెండో వారంలో కాళేశ్వరం చేరనుంది. విగ్రహం మెట్ల కింది భాగం, కుడి, ఎడమ వైపు మూడు భాగాల్లో రాతితో చెక్కిన నిర్మాణాలు చేపట్టనున్నారు. మూడు వైపులా రెయిలింగ్‌ను రాతితో కాకి, హంస, మకరం చిత్రాలను రాతిపై చెక్కి అమర్చనున్నారు. దీంతో పుష్కరఘాట్‌కు సరికొత్త శోభ సంతరించుకుంటుంది.

విస్తృత ప్రచారం..

మే 15 నుంచి 26 వరకు 12 రోజులపాటు జరిగే సరస్వతి పుష్కరాలకు రూ.20 లక్షలతో విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. ఈనేపథ్యంలో హైదరాబాద్‌తోపాటు ముఖ్యపట్టణాల్లో హోర్డింగ్స్, వాల్‌పోస్టర్లు, మీడియా ద్వారా ప్రచారం చేపట్టనున్నారు. ఈప్రచార బాధ్యతలు ప్రైవేట్ ఏజెన్సీకి ఇవ్వనున్నారని తెలిసింది. రూ.30 లక్షలతో పుష్కరాల 12 రోజుల కాశీ పండితులతో హారతిని అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇవికాకుండా టూరిజంశాఖ ద్వారా ఆరు ఎకరాల స్థలంలో 50–60కిపైగా టెన్‌సిటీ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇప్పటికే స్థలాన్ని ఏర్పాటు చేశారు. టెన్‌సిటీ తాత్కాలిక నిర్మాణాలు 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాల వరకు భక్తులకు అందుబాటులో ఉండనున్నాయి. టూరిజం శాఖ నిర్వహణ ఉంటుంది. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

రామప్ప శిల్పాలతో కీ చైన్ల ఆవిష్కరణ

వెంకటాపురం(ఎం): చారిత్రక రామప్ప దేవాలయాన్ని నిర్మించి 812సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం రామప్ప గార్డెన్‌లో రామప్ప శిల్పాలతో కూడిన కీ చైన్లను రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు పాండురంగారావు, ఉమ్మడి జిల్లా టూరిజం అధికారి శివాజీ, సేవా టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సూర్యకిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకతీయుల కళావైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. 812 ఏళ్ల క్రితం నిర్మించినా రామప్ప ఆలయం చెక్కు చెదరకుండా ఉందని, యునెస్కో గుర్తింపుతో ప్రపంచ పటంలో రామప్ప ఆలయానికి గుర్తింపు లభించిందన్నారు.





రామప్ప శిల్పాలతో కూడిన కీ చైన్లు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

● సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి: అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకపోతే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని తెలంగాణ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ అనేది బిచ్చం కాదని ఉద్యోగుల హక్కు అన్నారు. ఆయా సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలని లేకపోతే ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. సమావేశంలో ఆ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య బాధ్యులు మాదిరెడ్డి మల్లారెడ్డి, ఖాజా నయీముద్దీన్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ఎదుర్కొంటాం..


మాట్లాడుతున్న నరసింహారెడ్డి

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పింఛన్ బిల్లును ఐక్య ఉద్యమాల ద్వారా ఎదుర్కొందామని తెలంగాణ పెన్షనర్స్ అసోషియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.వీరస్వామి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ 2024–25 ఆర్థిక నివేదికపై చర్చించి ఆమోదించారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామ మనోహర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కర్రె సుధీర్‌బాబు, బాధ్యులు సీహెచ్.సూర్యప్రకాశ్, ఎల్.ప్రభాకర్ రెడ్డి, రత్నాకర్, కె.రమేశ్, కె.సమ్మారెడ్డి, సింగారెడ్డి, రాజిరెడ్డి, గైని సత్యనారాయణ, సుకుమార్‌రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, కిష్టయ్య, ఆగయ్య, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై టాస్క్‌ఫోర్స్ దాడి..

● పోలీసుల అదుపులో ఇద్దరు

మామునూరు : ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం రాత్రి దాడి చేసి ఓ మహిళతోపాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ తెలిపారు. గవిచర్ల రోడ్డులోని ఓ ఇంటిపై దాడి చేయగా ఓ మహిళ, హనుమకొండ బాలసముద్రం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పెరుమండ్ల రాజీవ్(32) పట్టుబడ్డారు. కాశికుంట ఫోర్ట్‌రోడ్డుకు చెందిన ఆటో డ్రైవర్ మేకల రాము యాదవ్ పరారీలో ఉన్నాడు. వీరి నుంచి 2 స్మార్ట్ ఫోన్లు, రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి చర్యల నిమిత్తం మామునూరు పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ తెలిపారు. ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్ట్‌కి కేవలం 5 కిలోమీటర్ల దూరంలో KUDA Approved Layout Plots 6999/- గజం మాత్రమే EMI సౌకర్యం కలదు. సంప్ర॥ 9573689941. [WA-7559]

SERVICES

■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 7416374863. [WA-7557]

మహిళలకు శుభవార్త

■ శ్రీశైలీ బ్యూటీపార్లర్‌లో ఫ్రీ బ్యూటీషియన్ కోర్సు గవర్నమెంట్ సర్టిఫికేట్‌తో నేర్పించబడును టైలరింగ్, మగ్గం వర్క్, మెహిందీ 5 వేలకే with సర్టిఫికేట్‌తో నేర్పబడును. 9989060668. [W-1265082]

WANTED

■ మా వద్ద సోలార్ ప్యానెల్స్ ఇన్‌స్టాల్ చేయుటకు అనుభవం గల టెక్నీషియన్ అర్జెంటుగా కావలెను. 9849608214, 9032209690. [W-1264100]

■ ఓరుగల్లు ఫ్యూయల్ (పెట్రోలు పంపు)లో వెహికల్ల టైర్లలో గాలిపెట్టుటకు అబ్బాయి కావలెను. (నైట్ డ్యూటీ) సంప్రదించండి: 9390432296. హంటర్ రోడ్, WGL-HNK. [WA-7558]

■ Hospital Staff, Lab Technicians (Exp), OT - Technicians, Medical Shop Boys (Exp) & Aayammas. Cont: Guardians Hospital, Mulugu "X" Road, Warangal 12 to 2 pm [WA-498]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [SCA25002557]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన ఒగ్గు మహేశ్ (42) ఎకరం భూమిలో వరి సాగు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటి బోరు నుంచి నీళ్లు సరిగా రాకపోవడంతో కళ్ల ముందే పంట ఎండిపోయింది. దీంతో మనోవేదనకు గురైన మహేశ్ ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఓ వైపు కూతురు పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలని.. మరో వైపు ఎండిపోతున్న వరి పంట మహేశ్ బలవన్మరణానికి కారణమయ్యాయి..

..ఈ నేపథ్యంలో ఎన్ని కష్టాలు ఎదురైనా.. ఎన్ని నష్టాలు చుట్టుముట్టినా అధైర్య పడొద్దని.. ఈసారి కాకపోయినా వచ్చే దఫా అయినా కలిసొస్తుందనే దృక్పథంతో ప్రతీ రైతు కొత్త ఆశలతో ఆలోచించాలని, అంతేకాని ఆత్మహత్యకు పాల్పడొద్దని 'వరి' అన్నదాతలను వేడుకుంటోంది.

నేను వరిని..!

అన్నదాత.. నన్ను కాపాడుకోలేక నీవు కాటికి పోవద్దు


వర్ధన్నపేటలో ఎండిన వరి పంటను కోస్తున్న రైతు

● నన్ను పండించి.. మీరు దిగులు చెందొద్దు

● రైతులకు 'వరి' విజ్ఞప్తి

నర్సంపేట: నేను కోట్లాది మంది ఆకలి తీర్చే 'వరి' పంటను. నన్ను రైతు మొలక దశలో చంటి పిల్లలా కాపాడుకున్నాడు. నాకు ఎలాంటి జబ్బు చేయకుండా మందు పిచికారీ చేశాడు. ఏపుగా పెరిగిన నన్ను 30 రోజుల్లో కూలీలతో నాటించాడు. నాలో ఎలాంటి కలుపు మొక్కలు మెలవకుండా గడ్డి మందు చల్లాడు. అప్పు తెచ్చి యూరియా, డీఏపీ, ఇతర మందులు వేసి నేను బలంగా పెరిగేలా చేశాడు. పొట్ట దశకు చేరుకోవడాన్ని నన్ను చూసి ఎంతో మురిసిపోయాడు. పైపాటు మందులు పిచికారీ చేశాడు. అయితే చి'వరి'కి నా దాహానికి నీరు లేకపోవడంతో (భూగర్భ జలాలు) ఎండిపోతున్న నన్ను చూసి బోరున విలపించాడు. నన్ను కాపాడుకునేందుకు తాపత్రయపడ్డాడు. నా సమీపంలో ఉన్న చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల నుంచి పైపులు వేసి నా దాహార్తిని తీర్చడానికి భగీరథ ప్రయత్నం చేశాడు. అలాగే, వేలాది రూపాయలు వెచ్చించి ట్యాంకర్లతో నీరు తీసుకొచ్చినా నా దప్పిక తీర్చడానికి శతవిధాలా యత్నించాడు. అయినా నా దూప తీరడం లేదు. దీంతో చివరికి కొందరు(అన్నదాతలు) నన్ను పశువులకు మేతగా వదిలేస్తుండగా.. మరికొందరు నన్ను కాపాడుకోలేక ప్రాణాలు వదిలేస్తున్నారు. (మీకు) రైతుకు పంటను అందించి మీ సంతోషాన్ని చూడాల్సిన నేను మీ కన్నీటిని చూస్తున్న. నన్ను క్షమించు రైతన్న. అయితే రైతన్నాలారా క్షణికావేశంలో కఠిన నిర్ణయాలు తీసుకోకండి. మీమ్ములను నమ్ముకున్న వారికి కన్నీళ్లు మిగిల్చకండి. ఒక్కసారి ప్రశాంత మనస్సుతో ఆలోచించండి. ప్రతీ సమస్యకు చావే పరిష్కారం కాదు. ఇలా అయితే భూమిపై ఎవరూ బతికుండరు. ప్రతీ సమస్యకు కచ్చితంగా పరిష్కారం ఉంటుంది. సాగులో ఎన్ని కష్టాలు ఎదురైనా.. ఎన్ని నష్టాలు చుట్టుముట్టినా అధైర్య పడొద్దు. ఈసారి కాకపోయినా వచ్చే దఫా అయినా కలిసొస్తుందనే దృక్పథంతో కొత్త ఆశలతో ఆలోచించు. అంతేకాని ఆత్మహత్యలకు పాల్పడి అటు కన్నవారికి.. ఇటు కట్టుకున్న వారికి శోకం మిగిల్చొద్దు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగులో నాదే (వరి) అగ్రస్థానం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8లక్షల 48వేల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటల సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా లక్ష ఎకరాలకు పైగా నేను(వరి) సాగైనట్లు తెలుస్తోంది. చెరువులు, కుంటలు, బోర్లు, వ్యవసాయ బావులు, ఎస్సారెస్పీ కాల్వల కింద యాసంగిలో ఎంతో ఆశతో నన్ను సాగు చేశారు. ఈ నెల చివరి వరకు నేను చేతికి అందొచ్చే దశలో ఉన్నా. ఈ క్రమంలో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటడంతో బావులు, బోరుబావుల నుంచి సరిగా నీరు రాకపోవడంతో నా దాహం తీరడం(ఎండిపోవడం) లేదు. దీంతో నన్ను కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. బోరు బావుల మరమ్మతులతోపాటు వ్యవసాయ బావుల పూడికతీతతో ఆర్థికంగా సతమతమవుతున్నారు. అయితే ఎంత లోతుకు వెళ్లినా నీరు మాత్రం రావడం లేదు. అలాగే, వరంగల్ జిల్లాలో పలు మండలాలకు ఎస్సారెస్పీ జలాలు అందుతున్నాయి. అయితే చివరి ఆయకట్టుకు నీరందకపోవడంతో నాకు దాహం (ఎండిపోయే పరిస్థితి) తీరడం లేదు. కాల్వలు తుమ్మ చెట్లు, ఇతర ముళ్ల పొదలతో నిండి ఉండడంతో నీరు ముందుకెళ్లే పరిస్థితి లేదు. వాగులు, ఎస్సారెస్పీ జలాలు రాలేకపోవడంతో పరీవాహక ప్రాంతాల్లో నాకు దాహం తీరడం లేదు. దీంతో పొట్ట దశలో ఉన్న నాపై ఆశలు వదులుకొనే పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35వేల మధ్య పెట్టుబడి పెట్టిన రైతులు ఇక నన్ను కాపాడే దారిలేక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రైతులు ఆత్మహత్యకు యత్నిస్తున్నారు. అన్నదాతలు ఇలా చేయకండి. ఈ ఏడాది కాకపోయినా వచ్చే ఏడాదైనా చేతికందొచ్చి మీకు సరిపడ దలు కురిపిస్తా..



పార్థసారథి హత్య కేసులో మరొకరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం శివారు బోరింగ్ తండా సమీపంలో దారుణహత్యకు గురైన దంతాలపల్లి ఎంజేపీ గురుకులం హెల్త్ సూపర్ వైజర్ తాటి పార్థసారథి హత్య కేసులో మరొకరిని అరెస్ట్ చేశామని రూరల్ సీఐ పి.సర్వయ్య, ఎస్సై వి.దీపిక శనివారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే మృతుడి భార్య స్వప్న, ఆమె ప్రియుడు వెంకటవిద్యాసాగర్, తెలగరి వినయ్ కుమార్, బోగ శివకుమార్, మోతుకూరి వంశీని అరెస్ట్ చేశామన్నారు. ఈ క్రమంలో శనివారం మరొకరి అరెస్ట్ చేశామన్నారు. గతంలో పార్థసారథి హత్య చేయడానికి నిర్వహించిన రెక్కీలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా రాజాఓమంగి మండలం జెడ్డంగి గ్రామానికి చెందిన కూసం లవరాజు పాల్గొన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో అతడిని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్.. నలుగురి అరెస్ట్

● రూ.20 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు చూపుతున్న పోలీసులు

కాజీపేట రూరల్ : ఆన్‌లైన్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 20వేల నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాజీపేట పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొంతమంది ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ పెట్టి ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందానికి శనివారం విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసి గోదాగు శ్రీనివాస్, గొడుగు రమేశ్, సముదాల శ్రీనివాస్, బోకరి సంతోశ్‌ను అరెస్ట్ చేసింది. వీరి నుంచి రూ.20 వేలు నగదుతో పాటు నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

పెద్దాపూర్‌లో ఆన్‌లైన్ చేయిస్తున్న మరొకరు..

ఆత్మకూరు: ఆన్‌లైన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ చేయిస్తున్న మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన ముక్కల రాజును టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముక్కల రాజు 'డఫాబెట్' అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్, 'గోల్డెన్ 365' (తీన్‌పత్తా) అనే గేమింగ్ వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్ చేయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సీఐ శ్రీధర్, సిబ్బందికి సమాచారం వచ్చింది. దీంతో వారి ఆదేశాల మేరకు రాజును అరెస్ట్ చేసి తదుపరి చర్యల నిమిత్తం ఆత్మకూరు పోలీసుకు అప్పగించారు. అలాగే, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నల్లగొండకు చెందిన మర్రి సుధీర్‌కుమార్, మర్రి సురేశ్ పరారీలో ఉన్నారు. రూ.42,100నగదు, స్మార్ట్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్ : క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 20 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వరంగల్ కరీమాబాద్‌లోని ఓ ఇంటి ఆవరణలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేసి కరీంనగర్‌కు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

దారి దోపిడీ దొంగల అరెస్ట్

వరంగల్: వరంగల్ దేశాయిపేట రోడ్డులోని సూర్య బార్ సమీపంలో ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి దారి వెంట వెళ్తున్న ఎల్‌బీనగర్‌కు చెందిన జాకీర్ అనే వ్యక్తికి చెందిన లారీలను ఆపి డ్రైవర్, క్లీనర్లను చితకబాది రూ.3 వేలు లాక్కున్న దారి దోపిడీ దొంగలను అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.షుకుర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకశిలానగర్‌కు చెందిన ఎండీ. షహబాజ్, కడారి పవన్‌పాల్, జూపాక మధుకర్ ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

'సన్న బియ్యం' దేశానికే ఆదర్శం

రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ


గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి సురేఖ, పక్కన మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తదితరులు

వరంగల్ చౌరస్తా/ఖిలా వరంగల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం దేశానికే ఆదర్శమని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27, 32,37,42వ డివిజన్లలోని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపాలనే ఉద్దేశంతో ప్రారంభించిన సన్నబియ్యం కార్యక్రమం విజయవంతమైందన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడంతో దళారీ వ్యవస్థ ఏర్పడి ఇతర ప్రాంతాలకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారిన్నారు. నేడు ప్రతీ లబ్ధిదారుడు సన్నబియ్యాన్ని వినియోగించుకుంటూ అక్రమ దందాకు అడ్డుకట్ట వేస్తున్నాడన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళి

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా 27 డివిజన్‌లోని కూరగాయల మార్కెట్ జంక్షన్‌లో ఆయన చిత్రపటానికి మంత్రి సురేఖ పూలమాలవేసి నివాళుల ర్పించారు. అదే విధంగా వరంగల్ 26వ డివిజన్‌లో రూ.10 లక్షల నిర్మించనున్న సిఖ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను, 42వ డివిజన్ రంగశాయిపేట లెనిన్‌నగర్‌లో రూ.22 లక్షల స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో నిర్మించే అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను మంత్రి సురేఖ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వరంగల్ కలెక్టర్ సత్యశారద, నగర మేయర్ గుండు సుధారాణి , బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వా కడే, కార్పొరేటర్లు చింతాకుల అనిల్, పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, సుధాకార్, వేల్పుగొండ సువర్ణ, గుండు చందన, పూర్ణచందర్, ఫుర్కాన్, బైరబోయిన ఉమ, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ , మీసాల ప్రకాశ్, జారతి రమేశ్, బోగి సురేష్, సంగరబోయిన చందర్, కేడల పద్మ, కర్రె కుమార్, తదితరులు పాల్గొన్నారు.

14న రామప్పకు మిస్ వరల్డ్ టీం

● రామప్ప వైభవాన్ని చాటిచెబుదాం

● ఎలాంటి పొరపాట్లు జరగొద్దు

● రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి


అధికారులకు సూచనలిస్తున్న పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి

వెంకటాపురం(ఎం): హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యే విదేశీలు మే 14న రామప్ప ఆలయాన్ని సందర్శించనున్నారని, ఈ నేపథ్యంలో మిస్ వరల్డ్ టీం అబ్బురపడేలా రామప్ప కళావైభవం చాటిచెప్పాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని కలెక్టర్ దివాకర టీఎస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు, ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి సందర్శించారు. మే 14న మిస్ వరల్డ్ టీం సందర్శన సందర్భంగా రామప్పలో కల్చరల్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని, కాకతీయుల చరిత్ర, శిల్పాకళాసంపద, పేరిణి తాండవంతో పాటు రామప్ప విశిష్టత వివరించాలన్నారు. ఆలయ సందర్శన, సరస్సులో బోటింగ్, కాటేజీల సందర్శన సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా మినిట్ టు మినిట్ ప్రోగ్రాం తయారు చేయాలన్నారు. ఏఏ శాఖల అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేపట్టాలో వివరించారు. హైదారాబాద్‌లో పర్యాటక, సాంస్కృతిక కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ప్రోగ్రాం కార్యక్రమాలు ఫైనల్ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, టూరిజం కార్పొరేషన్ అధికారులు సరిత, ధనరాజ్, శ్రీనివాసరావు, సూర్యకిరణ్, లోకేశ్, పురావస్తుశాఖ సీఏ నవీన్‌కుమార్, ఫోర్‌మెన్ ప్రదీప్‌బాబు, ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, ఎస్సై జక్కుల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పని ఉందని నమ్మబలికి..

● మహిళ వద్ద నుంచి బంగారం అపహరించిన దుండగులు

● తొర్రూరులో ఘటన


మహిళా కూలీలను బైక్‌పై ఎక్కించుకుని వెళ్తున్న దుండగుడు (సీసీ ఫుటేజీ)

తొర్రూరు: ఇద్దరు మహిళా కూలీలు అడ్డపై ఉండగా ఓ దుండగుడు పని ఉందని నమ్మించి బైక్‌పై ఎక్కించుకుని పుస్తెల తాడు అపహరించాడు. ఈ ఘటన తొర్రూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. తొర్రూరుకు చెందిన గూబ కొమురమ్మ, భూక్య సునీత రోజు వారీ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రోజూమాదిరి శనివారం కూడా పట్టణంలోని అన్నారం రోడ్డులోని అడ్డపై పని కోసం నిలుచున్నారు. వారిని గమనించిన ఓ దుండగడు పని ఉందని ఇద్దరిని బైక్‌పై ఎక్కించుకున్నాడు. మహబూబాబాద్ వెళ్లే రోడ్డులోని పీజీ తండా సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో బైక్ నిలిపాడు. మరో దుండగుడు అక్కడికి చేరుకున్నాడు. అనంతరం ఇద్దరిని బెదిరించి గూబ కొమురమ్మ మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని అక్కడి నుంచి ఉడాయించారు. ఈ ఘటనపై కొమురమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, అన్నారం రోడ్డులో సదరు మహిళలను బైక్‌పై ఎక్కించుకున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమవగా పోలీసులు పరిశీలించారు.

పట్టణంలో ఓ ఇంట్లో చోరీ..

పట్టణంలోని మూల మహేశ్ ఇంట్లో శుక్రవారం రాత్రి దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు అపహరించారు. యజమానులు వేరే ఊరుకు వెళ్లిన తరుణంలో ఇదే అదునుగా భావించిన దొంగలు.. ఇంటి తాళం పగులగొట్టి 2 తులాల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలు, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పోస్టల్ ఉద్యోగి మృతి

● స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన

● మృతుడు ఏపీలోని ఏలూరు జిల్లా వాసి


నాగదుర్గబాలాజీ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుదాఘాతంతో ఓ పోస్టల్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగింది. సీఐ జి.వేణు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా కైకలూరు మండలం నరసాయపాలెం గ్రామానికి చెందిన బోడావుల నాగదుర్గబాలాజీ(27) గతేడాది నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. మొదట మీదికొండలో అద్దెకున్న నాగదుర్గబాలాజీ.. ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్ తిరుమలనాథ కాలనీలో ఓ ఇంట్లోకి అద్దెకు వచ్చాడు. రోజూ మాదిరి శనివారం ఉదయం స్నానం చేసేందుకు హౌజ్‌లో ఉన్న నీటిని బకెట్‌లో పట్టుకునేందుకు మోటారు ఆన్ చేశాడు. అయితే నీరు రాకపోవడంతో స్విచ్ ఆఫ్ చేయకుండానే మోటారుకు ఏమైందో చూసేందుకు చేతితో ముట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై కేకలు వేస్తూ కిందపడ్డాడు. అయితే ఆ ఇంటిలో అతడు ఒక్కడే ఉండడంతో వెంటనే ఎవరూ గమనించలేదు. కాగా, కేకలు విన్న సమీపంలో పనిచేస్తున్న తాపీ కార్మికులు ఇంటి పక్కవారికి చెప్పారు. వారు వెళ్లి చూడగా కిందపడి ఉన్నాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, నాగదుర్గ ప్రసాద్ మృతిపై సహ ఉద్యోగులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక తీసుకురావడానికి వెళ్లి..

మహిళ దుర్మరణం

● ట్రాక్టర్ ట్రేలర్ బోల్తాపడడంతో ఈ ఘటన


లక్ష్మి(ఫైల్)

కొత్తగూడ: ఇసుక తీసుకురావడానికి వెళ్లిన ఓ మహిళ దుర్మరణం చెందింది. ట్రాక్టర్ ట్రేలర్ బోల్తా పడి మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండలంలోని వేలుబెల్లిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన ఐత ఎల్లయ్య ఇల్లు నిర్మించుకోవడానికి గ్రామ సమీపంలోని వాగు నుంచి ఇసుక తీసుకురావడానికి ట్రాక్టర్ తీసుకుని ఐత లక్ష్మి(56), సరోజన, ఎల్లయ్య, ప్రిన్స్ వెళ్లారు. ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసుకుని వస్తుండగా అటవీ ప్రాంతంలో ట్రేలర్ (డబ్బా) ఒక పక్క టైర్ రాయి ఎక్కడంతో బోల్తా పడింది. దీంతో ఐత లక్ష్మి, సరోజన, ఎల్లయ్య, ప్రిన్స్ ఇసుకలో కూరుకుపోయారు. ఈఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా మిగతా ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై కుశ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు సీహెచ్‌సీకి తరలించారు.